సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 20 । జూన్‌ । 2024



ఘనంగా తిరువీధి ఉత్సవం
విశాఖ నగరంలో ఇసుకకొండపై వెలిసిన రమా సహిత సత్యనారాయణ స్వామి వారి తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. 8లో



జూలో మకరంద మొక్కల పెంపకం 8లో
జూలోని సీతాకోక చిలుకల పార్కులో మకరంద మొక్కల పెంపకం చేపట్టారు.



సుందరంగా పిల్లల పార్కు
ముడసర్లోవ వద్ద పిల్లల పార్కును సుందరంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్‌

గాలివాన బాధితులకు జమాల్‌ఖాన్‌ సాయం

- దెబ్బతిన్న17 ఇళ్లకు సిమెంటు రేకులు, సామగ్రి పంపిణీ



బాధితులకు సిమెంటు రేకులు అందిస్తున్న జమాల్‌ఖాన్‌

వీఆర్‌పురం: మండలంలో ఈనెల 15న సంభవించిన గాలివాన బీభత్సానికి నష్టపోయిన కుటుంబాలకు ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు, జమాల్‌ఖాన్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ వ్యవస్థాపకుడు జమాల్‌ఖాన్‌ బాసటగా నిలిచారు. వడ్డిగూడెం, రాజుపేట, రేఖపల్లి గ్రామాల్లో సుమారు 17 ఇళ్ల పైకప్పులు దెబ్బతిన్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఆయన దెబ్బతిన్న ఇళ్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఇళ్ల పైకప్పునకు అవసరమైన సిమెంటు రేకులు, ఇతర సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ సయ్యద్‌మౌలానా ఫాజిల్‌, జెడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి పాల్గొన్నారు.

పిడుగుపాటుకు తాటాకిల్లు దగ్ధం

- వ్యక్తికి గాయాలు
- పెదార్కూరులో ఘటన



పెదార్కూరులో పిడుగుపాటుకు కాలిపోయిన తాటాకిల్లు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీరాములు

కూనవరం: పిడుగుపాటుకు తాటాకు ఇల్లు దగ్ధం కాగా వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. మండలంలోని పెదార్కూరులో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుండగా 6.30 గంటల ప్రాంతంలో పూసం శ్రీరాములు ఇంటిపై పిడుగుపడింది. వెంటనే తాటాకిల్లు పైకప్పు కాలిపోతుండగా కుటుంబ సభ్యులు అంతా బయటకు పరుగులు తీశారు. ఈఘటనలో యజమాని శ్రీరాములుకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అతనిని కోతులగుట్ట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలాన్ని రెవెన్యూ అధికారులు, వీఆర్వో రాజారావు, ఆర్‌ఐ జల్లి సత్యనారాయణ సందర్శించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదించామని వారు పేర్కొన్నారు.

గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్టు



గంజాయి నిందితులతో ఎస్‌ఐ శ్రీనివాస్‌, పోలీసులు

జి.మాడుగుల: మైదాన ప్రాంతాలకు అక్రమంగా వాహనంలో తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాస్‌ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పాడేరు వెళ్లే రోడ్డు మార్గంలో కె.కోడాపల్లి పంచాయతీ బందవీధి జంక్షన్‌ వద్ద బుధవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో అటుగా వస్తున్న వ్యాన్‌ను పరిశీలించగా 36 కిలోల గంజాయి పట్టుబడిందని ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసులో అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం గోకాడ వరహామూర్తి, దోకల అప్పారావు, జి.మాడుగుల మండలం పెదలోచలి పంచాయతీ, సింధుగుల గ్రామానికి చెందిన కోడా రామకృష్ణను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ వివరించారు. గంజాయిని తరలిస్తున్న వాహనాన్ని, గంజాయిని సీజ్‌ చేశామని తెలిపారు. నిందితులు ముగ్గురిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌ విధించినట్టు ఆయన పేర్కొన్నారు.

ప్రకృతి ఒడిలో సాగిపోయేలా..

- తాటిగుడ, కటికి జలపాతాలకు పక్కా రోడ్ల నిర్మాణం
- రూ.20 కోట్లు వెచ్చించిన గత ప్రభుత్వం
- నాలుగు నెలల్లో పూర్తి కానున్న గేటువలస– కటికి రహదారి పనులు
- పెద్దూరు మీదుగా తాటిగుడకు అందుబాటులోకి రానున్న రోడ్డు సౌకర్యం

తాటిగుడ, కటికి జలపాతాల సందర్శకులకు ఇబ్బందులు తప్పనున్నాయి. ఆయా ప్రాంతాల వెళ్లే రహదారులను విస్తరించేందుకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే కటికి జలపాతం రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాటిగుడ జలపాతానికి వెళ్లే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించేందుకు గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్‌ అధికారులు చర్యలు చేపట్టారు. ఇవి పూర్తయితే ప్రకృతి ఒడిలో జలపాతాల వద్దకు వెళ్లేలా రోడ్ల సౌకర్యం అందుబాటులోకి రానుంది.



కటికి జలపాతం



తాటిగుడ జలపాతం



బొర్రా గేటువలస నుంచి కటికి గ్రామానికి రూ.12.90 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన తాటిగుడ, కటికి జలపాతాలకు మంచిరోజులొచ్చాయి. ఈ రెండింటిని తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి భారీగా పర్యాటకులు వస్తుంటారు. అయితే గతంలో ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేక సందర్శకులు ఇబ్బందులు పడేవారు. రాళ్లు తేలిన రోడ్లపై సాహస ప్రయాణాలు సాగించి జలపాతాల వద్దకు చేరుకునేవారు. పర్యాటకుల వాహనాల తాకిడి వల్ల రోడ్డు ఇరుకుగా మారడంతో ట్రాఫిక్‌ సమస్య తలెత్తేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. సందర్శకులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించింది.

‘తాటిగుడ’కు రూ.7.10 కోట్లు..

గతంలోని తాటిగుడ జలపాతానికి రోడ్డు సౌకర్యం ఉండేది కాదు. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో పెద్దూరు నుంచి జలపాతం వరకు సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం జాతీయ ఉపాధి హామీ పథకంలో పెద్దూరు మీదుగా జలపాతం వరకు 40 అడుగుల వెడల్పున సీసీరోడ్డుకు రూ.6 కోట్లు, తాటిగుడ గ్రామ సమీపంలో వంతెన నిర్మాణానికి 1.10 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. అయితే రోడ్డును 40 అడుగుల వెడల్పున విస్తరించడం వల్ల గిరిజనుల ఇళ్లను తొలగించాల్సి ఉంది. దీనిపై వారంతా కలెక్టర్‌ను కలిసి విన్నవించుకున్నారు. సమస్య పరిష్కరించిన వెంటనే గిరిజన సంక్షేమశాఖ పర్యవేక్షణలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మార్చిలో నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను మూడు నుంచి నాలుగు నెలల్లోగా పూర్తి చేస్తామని ట్రైబల్‌ వెల్ఫేర్‌ ఏఈ గణేష్‌ తెలిపారు.

కటికి రోడ్డుకు రూ.12.90 కోట్లు..

కటికి జలపాతానికి వెళ్లేందుకు పర్యాటకులు గతంలో తీవ్ర ఇబ్బందులు పడేవారు. రాళ్లతేలిన రోడ్లపై ప్రయాణించాల్సిన పరిస్థితి ఉండేది. 2018లోని పంచాయతీరాజ్‌శాఖ ప్రధానమంత్రి గ్రామసడక్‌ యోజన పథకంలో గేటువలస నుంచి కటికి గ్రామానికి రూ.2.52 కోట్లతో నాలుగు కిలోమీటర్ల పొడవునా తారు రోడ్డు నిర్మించడంతో ఇబ్బందులు తప్పాయి. ఈ నేపథ్యంలో 40 అడుగుల విస్తరణకు జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.12.90 కోట్లు గత మార్చి నెలలో మంజూరయ్యాయి. పంచాయతీరాజ్‌ పర్యవేక్షణలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొద్దిరోజుల్లో పనులు పూర్తి చేస్తామని పంచాయతీరాజ్‌ ఇంజినీరింగ్‌ విభాగం అసిస్టెంట్‌ ఇంజినీరు సాయి విజయ్‌ తెలిపారు.

విద్యాసంస్థల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులు

కలెక్టర్‌ విజయ సునీత ఆదేశం



నేనూ బడికి పోతా ప్రచార ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌ విజయసునీత, డీఈవో బ్రహ్మాజీరావు

సాక్షి,పాడేరు: జిల్లాలోని 967 విద్యాసంస్థల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో పనిచేయాలని కలెక్టర్‌ ఎం.విజయసునీత ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లో విద్య, ఇంజనీరింగ్‌ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 130 అంగన్‌వాడీ, 817 పాఠశాలలు, 20 జూనియర్‌ కళాశాలల్లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ విషయంలో వెనుకబడిన మండలాలపై ఎంఈవోలు ప్రత్యేకంగా దృష్టి సారించాలని, సంబంధిత నిర్మాణాల ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్‌ చేయాలని ఆదేశించారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు అభిషేక్‌, సూరజ్‌గనోరే, చైతన్య, డీఈవో బ్రహ్మజీరావు, డీడీ కొండలరావు, గిరిజన సంక్షేమశాఖ ఈఈ డీవీఆర్‌ఎం రాజు,ఎంఈవోలు,ఏటీడబ్ల్యూవోలు పాల్గొన్నారు.

నేనూ బడికిపోతా విజయవంతం

నేనూ బడికి పోతా కార్యక్రమాన్ని జిల్లాలో నూరుశాతం విజయవంతం చేయాలని కలెక్టర్‌ విజయసునీత ఆదేశించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార ఫ్లెక్సీని ఆమె ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను బడిఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. చింతూరు మండలంలో అత్యధికంగా 352 మంది బడిబయట పిల్లలను బడిలో చేర్పించడంపై అభినందించారు. జిల్లాలో విద్యార్థుల హాజరుశాతం పెంచాలన్నారు. పూర్తిస్థాయిలో వచ్చిన పాఠ్య,నోట్‌ పుస్తకాల పంపిణీని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంఈవోలు,ఏటీడబ్ల్యూవోలు తరచూ పాఠశాలల తనిఖీలు చేపట్టాలన్నారు.సంబంధిత నివేదికలు తనకు అందజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఈవోతోపాటు ,సర్వశిక్ష అధికారులు పాల్గొన్నారు.

వినియోగదారులకు బాసటగా సీజీఆర్‌ఎఫ్‌

సీజీఆర్‌ఎఫ్‌ ఛైర్‌పర్సన్‌ సత్యనారాయణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీజీఆర్‌ఎఫ్‌ ఛైర్‌పర్సన్‌ సత్యనారాయణ

చింతపల్లి రూరల్‌: విద్యుత్‌ సమస్యల పరిష్కరించే విషయంలో వినియోగదారులకు బాసటగా విద్యుత్‌ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్‌) పనిచేస్తుందని ఆ సంస్థ ఛైర్‌పర్సన్‌,రిటైర్డ్‌ జడ్జి డాక్టర్‌ బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు విద్యుత్‌ వినియోగం.. ఇందుకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి విద్యుత్‌ సమస్యనైనా న్యాయస్థానం వరకు వెళ్లకుండా పరిష్కరించుకోవచ్చన్నారు. విద్యుత్‌ సమస్య పరిష్కారానికి సంబంధించి 1912 టోల్‌ ఫ్రీ నంబర్‌కు కాల్‌ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఆరు గంటల్లో సమస్య పరిష్కరిస్తుందన్నారు. విద్యుత్‌ సమస్యను 24 గంటల్లో పరిష్కరించకపోతే అట్టి పరిస్థితుల్లో విద్యుత్‌శాఖ వినియోగదారుల ఖాతాల్లో రోజుకు రూ.200 చొప్పున జమ చేస్తుందన్నారు. ఊహించని పరిస్థితుల్లో విద్యుత్‌షాక్‌కు గురై మనుషులు,పశువులు మృతి చెందిన సందర్భంలో విద్యుత్‌ శాఖ రూ.5 లక్షల వరకు నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. అనంతరం ఆయన స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో వినియోగదారుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్‌ విజయ భారతి, సభ్యులు జనార్దనరావు, శ్రీనివాస్‌, సురేంద్ర, విద్యుత్‌ శాఖ ఈఈ సాయిబాబా, ఏఈ ప్రభాకర్‌ పాల్గొన్నారు.

టీడీపీ నేతల రాద్ధాంతం

- డౌనూరులో నిలిచిన విత్తన పంపిణీ
- ఇబ్బందులు పడిన రైతులు

కొయ్యూరు: మండలంలోని డౌనూరులో బుధవారం నిర్వహించిన విత్తన పంపిణీలో టీడీపీ నేతల తీరు రైతులను ఇబ్బందులకు గురి చేసింది. దీంతో వారు విత్తనాలు తీసుకోకుండానే వెనుదిరగాల్సి వచ్చింది. అక్కడి ఆర్‌బీకేలో బుధవారం ఉదయం విత్తన పంపిణీకి జెడ్పీటీసీ వారా నూకరాజు, డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు, డౌనూరు, మూలపేట సర్పంచ్‌లు భవాని, వెంకటలక్ష్మి విచ్చేశారు. అయితే తమకు చెప్పకుండా ఎలా పంపిణీ చేస్తారని టీడీపీ నేతలు గొడవకు దిగారు. దీంతో వారు కూడా పంపిణీ చేసేందుకు రావాలని జెడ్పీటీసీ వారా నూకరాజు కోరారు. వారి కోసం ఎదురుచూశారు. ఉదయం 11 గంటల తరువాత వచ్చిన టీడీపీ నేతలు గొడవకు దిగడంతో పంపిణీ నిలిచిపోయింది. దీంతో రైతులు నిరాశతో వెనక్కి వెళ్లిపోయారు. దీనిపై జెడ్పీటీసీ వారా నూకరాజు మాట్లాడుతూ విత్తనాలు కలిసి పంపిణీ చేద్దామని టీడీపీ నేతలకు చెప్పినా వారు సానుకూలంగా స్పందించలేదన్నారు. వారిలో ప్రజాప్రతినిధులు లేకపోయినా కలిసి పంపిణీ చేద్దామని చెప్పామన్నారు. అయినప్పటికీ రాద్ధాంతం చేయడం వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు.

బాలికను మోసగించిన వ్యక్తికి జైలు, జరిమానా

20 ఏళ్ల కఠిన కారాగారం విధిస్తూ తీర్పు

రంపచోడవరం: బాలికను నమ్మించి మోసగించడమే కాకుండా ప్రలోభాలకు గురిచేసిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పిందని రంపచోడవరం సీఐ వాసా వెంకటేశ్వరరావు తెలిపారు. రంపచోడవరంలో 2019లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి బుధవారం కోర్టు ఇచ్చిన తీర్పు వివరాలను ఆయన తెలిపారు. రంపచోడవరానికి చెందిన బాలికను వై.రామవరం మండలం ఎర్రంరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మద్దికొండ సుధాకర్‌ (27) అనే వ్యక్తి ప్రేమిస్తున్నట్టు నమ్మించాడు. పెళ్లి చేసుకుంటానని ప్రలోభాలకు గురి చేసి ఆమెను బలవంతంగా విశాఖ తీసుకువెళ్లాడు. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సుధాకర్‌పై రంపచోడవరం పోలీస్‌స్టేషన్‌లో కిడ్నాప్‌, లైంగిక దాడి, పోక్సో కేసులు నమోదయ్యాయి. అప్పటి ఏఎస్పీ వకుల్‌ జిందాల్‌ ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. దర్యాప్తు ముగించి స్పెషల్‌ పోక్సో కోర్టుకు నివేదించారు. ఈ కేసుకు సంబంధించి బుధవారం కాకినాడలోని స్పెషల్‌ పోక్సో కోర్టులో విచారణ జరిగింది. కిడ్నాప్‌ కేసుకు సంబంధించి ఆరు నెలల సాధారణ జైలు, రూ.వెయ్యి జరిమానా, పోక్సో కేసుకు సంబంధించి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా నిందితుడికి విధిస్తూ న్యాయమూర్తి కొండపల్లి శ్రీదేవి తీర్పు చెప్పారని సీఐ తెలిపారు. సాక్షులను ప్రవేశపెట్టి నిందితుడికి శిక్ష పడేలా చేసిన కోర్టు హెచ్‌సీ కోటి, కోర్టు మానిటరింగ్‌ సెల్‌ ఇన్‌స్పెక్టర్‌ కృష్ణకుమార్‌, పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ పితాని శ్రీనివాసరావును ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్‌ సిన్హా అభినందించారు.

త్వరితగతిన నష్టపరిహారం అందేలా చర్యలు

పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు హైవే బాధిత రైతుల వినతి



పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు

పాడేరు : హైవే రహదారి నిర్మాణం కారణంగా నష్టపోతున్న తమ భూములకు సంబంధించిన నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జీకే వీధి మండలం పెదవలస, చాపరాతిపాలెం, రంపుల గ్రామాల గిరిజనులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు పాడేరులో ఆయనను కలిసి వినతపత్రం అందజేశారు. పరిహారం చెల్లించడంలో హైవే అథారిటీ, రెవెన్యూ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని వారు వాపోయారు. తమ గ్రామాల పరిధిలోని రహదారికి ఇరువైపులా వాణిజ్య పంటలైన కాఫీ, మిరియాలు సాగు చేస్తున్నామని వివరించారు. వీటి మీదుగా ఎన్‌హెచ్‌516ఈ రహదారి హైవే నిర్మాణం చేపడుతున్నారన్నారు. తాము పనులు ప్రారంభించక ముందే పరిహారం చెల్లిస్తామని హైవే అథారిటి అధికారులు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు గతంలో సమావేశాలు నిర్వహించిన సందర్భంగా హామీ ఇచ్చారన్నారు. కానీ నేటికి కూడా ఒక్క పైసా కూడా పరిహారం చెల్లించలేదన్నారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

- బైక్‌ అదుపు తప్పడంతో ప్రమాదం
- రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయం




లోవ మృతదేహం

చింతపల్లి రూరల్‌: మండలంలో పెద్దగడ్డ సమీప మలుపు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతి ప్రాణాలు కోల్పోయింది. ఎస్‌ఐ అరుణ కిరణ్‌ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎర్రబొమ్మల పంచాయతీ గానుగుల గ్రామానికి చెందిన మర్రి లోవ(20), కాబోయే భర్త సిందేరి చందుతో కలిసి ద్విచక్ర వాహనంపై చింతపల్లి నుంచి స్వగ్రామం గానుగుల బయలుదేరింది. పెద్దగడ్డ వద్ద మలుపు వద్దకు వచ్చేసరికి లంబసింగి నుంచి చింతపల్లి వస్తున్న పశుసంవర్ధక శాఖ సంచార పశువైద్య వాహనం డ్రైవర్‌ హారన్‌ మోగించాడు. దీంతో సిందేరు చందు కంగారు పడటంతో బైక్‌ అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో వెనుక కూర్చున్న లోవ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికుల సాయంతో ప్రైవేట్‌ వాహనంలో చింతపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా ఆమె మార్గం మధ్యలో మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రాజవొమ్మంగిలో మలేరియా కేసు నమోదు

- అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ సిబ్బంది
- దోమల నివాణ మందు పిచికారీ



దోమల నివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న వైద్యాధికారి సుష్మ

రాజవొమ్మంగి: స్థానిక కొంగరవారివీధిలో బుధవారం ఒక మలేరియా పాజిటివ్‌ కేసు నమోదు కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ ఇంటి పరిసరాల్లో, వీధిలోని ఇళ్ల చుట్టూ దోమల నివారణ మందు పిచికారీ చేపట్టారు. బాధిత కుటుంబంలో మలేరియా కాంటాక్ట్‌ కేసులు ఏవైనా ఉన్నాయా అనే కోణంలో రక్తపూతలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. మాస్‌ కాంటాక్టు కేసులు రాకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ, మలేరియా సబ్‌ యూనిట్‌ అధికారి ప్రసాద్‌ తెలిపారు. ఎంటీఎస్‌ సోమరాజు, హెచ్‌ఎస్‌ సుధాకర్‌, హెచ్‌వీ లక్ష్మమ్మ, ఏఎన్‌ఎం సత్యవతి, పంచాయతీ సెక్రటరీ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సికిల్‌ సెల్‌ రహిత సమాజమే లక్ష్యం



పాడేరులో సికిల్‌సెల్‌ అనీమియా అవగాహన ర్యాలీలో కలెక్టర్‌ విజయసునీత, ఐటీడీఏ పీవో అభిషేక్‌



సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కలెక్టర్‌ విజయసునీత, ఎంపీ తనూజారాణి



ఏకలవ్య పాఠశాలలో మాట్లాడుతున్న చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు
- కలెక్టర్‌ విజయ సునీత
- పాడేరులో అవగాహన ర్యాలీ



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



రంపచోడవరంలో ర్యాలీని ప్రారంభిస్తున్న పీవో సూరజ్‌ గనోరే

సాక్షి,పాడేరు: సికిల్‌సెల్‌ అనీమియా రహిత సమాజం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని కలెక్టర్‌ ఎం.విజయసునీత అన్నారు. ప్రపంచ సికిల్‌ సెల్‌ అనీమియా దినోత్సవాన్ని బుధవారం తలారిసింగి ఇండోర్‌ స్టేడియంలో నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ,అరకు ఎంపీ డాక్టర్‌ గుమ్మా తనూజారాణి, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ సికిల్‌ సెల్‌ అనీమియా వ్యాధి కాదన్నారు. మేనరిక వివాహాలు, జన్యుపరంగా సంక్రమిస్తుందన్నారు. సికిల్‌ సెల్‌ అనీమియాపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యం తెచ్చేందుకు చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మేనరిక వివాహాలకు దూరంగా ఉండాలని కోరారు.

2300 మందికి నిర్ధారణ

పాడేరు ఐటీడీఏ పరిధిలోని 2300 మందికి సికిల్‌ సెల్‌ అనీమియా నిర్ధారణ అయిందని పీవో అభిషేక్‌ తెలిపారు. వీరికి ప్రతినెలా ప్రభుత్వం రూ.10 వేల పింఛను అందించి వైద్యసేవలు కల్పిస్తోందన్నారు. సుమారు 6.76లక్షల మంది జనాభాలో ఇప్పటివరకు 1.76లక్షల మందికి స్క్రీనింగ్‌ పరీక్షలు నిర్వహించామని, 2026 నాటికి నూరుశాతం పరీక్షలు పూర్తి చేస్తామన్నారు.

అవగాహనతో నిర్మూలన: అరకు ఎంపీ తనూజారాణి

గిరిజన ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలద్వారా సికిల్‌సెల్‌ అనీమియాను నిర్మూలించవచ్చని అరకు ఎంపీ డాక్టర్‌ గుమ్మా తనూజారాణి అన్నారు. రాష్ట్రంలో సికిల్‌సెల్‌ అనీమియాలో జిల్లా రెండవ స్థానంలో ఉందని, 40 ఏళ్లలోపు వయసులో ఉన్నవారందరికీ పరీక్షలు నిర్వహించాలన్నారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ సికిల్‌సెల్‌ అనీమియా నిర్మూలనకు చేపడుతున్న చర్యలు హర్షణీయమన్నారు. రోగులకు రక్తం అవసరాలు అధికంగా ఉన్నందున అందుకు తగ్గట్టుగా నిల్వలు అందుబాటులో ఉంచాలని కోరారు. అనంతరం అవగాహన ర్యాలీని కలెక్టర్‌ విజయసునీత ప్రారంభించారు. పాడేరు పురవీధుల్లో ర్యాలీ జరిగింది. అలాగే తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో 100 మందికి, ఐటీడీఏ సమావేశమందిరంలో 30మందికి సికిల్‌సెల్‌ అనీమియా స్క్రీనింగ్‌ పరీక్షలు జరిపారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్‌ జమాల్‌బాషా, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ విశ్వామిత్ర, డీసీహెచ్‌ డాక్టర్‌ కృష్ణారావు, డీఆర్డీఏ పీడీ మురళి, ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, ఐసీడీఏస్‌ పీడీ సూర్యలక్ష్మి, చింతలవీధి ఎంపీటీసీ గిడ్డి విజయలక్ష్మి పాల్గొన్నారు.

చింతూరు: సికిల్‌సెల్‌ అనీమియా వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఐటీడీఏ పీవో కావూరి చైతన్య సూచించారు. బుధవారం మండలంలోని లక్కవరం ఏకలవ్య మోడల్‌ రెసిడెన్షియల్‌ పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఈ వ్యాధి గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్‌ పుల్లయ్య, వీఆర్‌పురం జెడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నరేష్‌, సర్పంచ్‌ తిరుపతిరావు, ఏటీడబ్ల్యూవో సుజాత, ఎంపీడీవో రవిబాబు, సీడీపీవో విజయగౌరి, ఎంఈవో–2 వెంకటేశ్వర్లు, ఏపీఎం నాయుడు, డాక్టర్‌ ఉదయ్‌కుమార్‌ పాల్గొన్నారు.

రంపచోడవరం: ఏజెన్సీలోని సికిల్‌ సెల్‌ అనీమియా వ్యాధి నిర్మూలనకు తగు చర్యలు తీసుకుంటున్నామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌ గనోరే తెలిపారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో సికిల్‌సెల్‌ అనీమియా లక్షణాలను వివరించారు. తమ ఐటీడీఏ పరిధి 19 పీహెచ్‌లకు చెందిన గ్రామాల్లో సికిల్‌ సెల్‌ అనీమియా వ్యాధిగ్రస్తులను గుర్తించి మందులు అందజేయాలని వైద్యాధికారులను ఆదేశించినట్టు చెప్పారు. ఐటీడీఏ కార్యాలయం నుంచి అంబేడ్కర్‌ సెంటర్‌ వరకు ర్యాలీ సాగింది. విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. ఏపీవో జనరల్‌ సీహెచ్‌ శ్రీనివాసరావు, ఏడీఎంహెచ్‌వో జి. శిరీష, వైద్యాధికారులు,ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఎంపీడీవో హరికృష్ణ, ఎంఈవో ఎం రామకృష్ణ, ఏటీడబ్ల్యూవో రామ తులసి పాల్గొన్నారు.

హోటళ్లు, దుకాణాల్లో తనిఖీలు

- ఆరుచోట్ల ఫుడ్ శాంపిళ్ల సేకరణ
- ఆహార పదార్థాల తయారీలో నాణ్యత పాటించకుంటే చర్యలు
- జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వేణుగోపాల్



ముంచంగిపుట్టులో తనిఖీలు చేస్తున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వేణుగోపాల్, ఎంపీడీవో కిరణ్‌కుమార్

ముంచంగిపుట్టు: హోటళ్లు,దుకాణాల్లో యజమానులు నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తీసుంటామని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి బి.వేణుగోపాల్ హెచ్చరించారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన ఎంపీడీవో కిరణ్‌కుమార్, పంచాయితీ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. హోటళ్లలో అపరిశుభ్రతను గుర్తించిన వారు ఆహార పదార్థాల్లో నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఆహార పదార్థాలు ఆకర్షణీయంగా ఉండేందుకు రసాయన రంగులు వినియోగించవద్దని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటించని ఆరు దుకాణాల్లో ఫుడ్ శాంపిళ్లను ఆయన సేకరించారు. అనంతరం వేణుగోపాల్ మాట్లాడుతూ అపరిశుభ్రంగా ఉన్న హోటళ్లకు సంబంధించి యజమానులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించనట్టుగా శాంపిళ్లలో నిర్ధారణ అయితే సంబంధిత వ్యాపారులపై కేసు నమోదు చేయడమే కాకుండా అపరాధ రుసుం విధిస్తామని స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శులు గోపి, సింహాచలం పాల్గొన్నారు.

అరకు ఎంపీ తనూజారాణికి అభినందనల వెల్లువ



అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి, చెట్టి వినయ్ దంపతులను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాడేరు : అరకు పార్లమెంట్ అభ్యర్థిగా ఘన విజయం సాధించిన డాక్టర్ గుమ్మా తనూజారాణి, ఆమె భర్త వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ పాడేరు మండల కార్యవర్గం ఆమెను తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యకర్తలకు ఏ కష్టం, నష్టం వచ్చిన నిత్యం అందుబాటులో ఉంటానని ఆమె వారికి భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ లకే రామసత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు సల్లా చిట్టమ్మ, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, వంతాల నరేష్, ఎంపిటిసి ముదిలి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సిరగం దశమూర్తి, నాయకులు రొబ్బా కృష్ణారావు, మదెల రాజేష్, సూకురు సింహాచలం తదితరులున్నారు.

- ఈ-పోర్టల్‌లో స్టార్ రేటెడ్ ఉత్పత్తులు

ఇంధనం ఆదా

- ఈఈఎస్ఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ఈపీడీసీఎల్
- దేశంలోనే తొలి డిస్కమ్‌గా ఈపీడీసీఎల్
- స్టార్ రేటెడ్ గృహోపకరణాలు నేరుగా కొనుగోలు చేసే అవకాశం



ఈఈఎస్ఎల్ మార్ట్ వెబ్‌సైట్



ఒప్పంద పత్రాలతో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, ఈఈఎస్ఎల్ సీఈవో విశాల్ కపూర్

సాక్షి, విశాఖపట్నం : ఇంధన వనరుల ఆదా, పర్యావరణ పరిరక్షణలో ఎప్పటికప్పుడు గేర్ మార్చుతూ ఎనర్జీ ఎఫిషియన్సీలో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచేలా దూసుకుపోతున్న ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్) మరో వినూత్న ఆవిష్కరణకు నాంది పలికింది. విద్యుత్ వినియోగదారులకు నేరుగా స్టార్ రేటెడ్ గృహోపకరణాలు అందించేందుకు ఏపీఈపీడీసీఎల్‌తో జతకట్టింది. తమ పోర్టల్ ద్వారా నేరుగా ఇంధన సామర్థ్య ఉత్పత్తుల్ని అందించనుంది. ఈ మేరకు ఈఈఎస్ఎల్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది.

డిస్కమ్‌లతో ఈఈఎస్ఎల్ జత

కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ రంగ సంస్థల జాయింట్ వెంచర్ అయిన ఈఈఎస్ఎల్ అత్యాధునిక ఇ-కామర్స్ పోర్టల్ ఈఈఎస్ఎల్ మార్ట్‌ని ఇటీవలే ఆవిష్కరించింది. ఈ కామర్స్ ప్లాట్ ఫామ్‌లో ఎల్ఈడీ బల్బుల నుంచి బీఎల్‌డీసీ ఫ్యాన్లు, ఎయిర్ కండీషనర్ల వరకూ విస్తృతమైన స్టార్ రేటెడ్ ఉత్పత్తుల శ్రేణి విక్రయించేలా పొందుపరిచారు. ఇంధన వనరుల పరిరక్షణకు దోహదపడే ఉత్పత్తుల సమాహారంగా ఈ ప్లాట్‌ఫామ్.. పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలనుకునే ప్రజలకు దోహదపడుతోంది. అయితే ఈ వ్యవస్థను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు డిస్కమ్‌లతో జతకట్టాలని ఈఈఎస్ఎల్ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈపీడీసీఎల్‌తో కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, ఈఈఎస్ఎల్ సీఈవో విశాల్ కపూర్ ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం ఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లోకి వెళ్లినా.. బిల్లులు చెల్లించే సమయంలో వాట్సప్ ద్వారా, ఎస్ఎంఎస్ ద్వారా ఈకామర్స్ సైట్ లింక్‌ని వినియోగదారులకు అందజేయనున్నారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా వినియోగదారులకు విక్రయించే సౌకర్యాన్ని కల్పించడంతో సరఫరా గొలుసుని క్రమబద్ధీకరిస్తూ సరసమైన ధరల్లో స్టార్ రేటెడ్ ఉత్పత్తులను ఈపీడీసీఎల్ పరిధిలోని వినియోగదారులకు అందజేయడమే తమ లక్ష్యమని సీఈవో విశాల్ కపూర్ స్పష్టం చేశారు.

ఇంధన వినియోగంలో విప్లవాత్మక మార్పు

ప్రస్తుతం 33 శాతం శక్తిని ఆదా చేసే 9 వాట్స్ బల్బులు, ఇన్వర్టర్ బల్బులు, 40 శాతం తక్కువ విద్యుత్‌ని ఖర్చు చేసే 5 స్టార్ ఫ్యాన్‌లు మార్కెట్‌లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇలాంటి ఉత్పత్తుల వినియోగం ద్వారా ఇంధన పొదుపులో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని విశాల్‌కపూర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంధన పరిరక్షణలో తిరుగులేని శక్తిగా భారత్‌ని ప్రపంచంలో నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టాలన్న లక్ష్యంతో తొలి అడుగు విశాఖ నుంచి వేస్తున్నట్లు తెలిపారు. ఒకే ప్లాట్‌ఫామ్‌పై ఉత్పత్తులు, సేవలు, ఫైనాన్సింగ్‌ని తీసుకురావడమే కాకుండా పర్యావరణ స్పృహ పై దేశంలోని ప్రతి పౌరుడికీ బాధ్యత కల్పించేలా అవగాహనతో పాటు ప్రాథమిక విధిగా మార్చే దిశగా ప్రయాణం సాగిస్తున్నామని వివరించారు. డిస్కమ్‌లతో కలిసి లైఫ్ మిషన్‌కు మద్దతునిస్తూ స్ట్రీట్‌లైటింగ్, ఎల్ఈడీ వినియోగం వంటి జాతీయ స్థాయి కార్యక్రమాల్ని సమష్టిగా నిర్వహిస్తున్నామని విశాల్ కపూర్ వివరించారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, వినియోగాల్ని పరిగణనలోకి తీసుకుంటూ సున్నాకు కర్బన ఉద్గారాల నియంత్రణ లక్ష్యాలకు అనుగుణంగా సంపూర్ణ సహకారం అందించేలా అద్భుతమైన మార్పులకు నాంది పలుకుతున్నామన్నారు. ఈ పరికరాలు కొనుగోలు, వినియోగం ద్వారా దేశంలో 20 శాతం వరకూ విద్యుత్‌ని ఆదా చేస్తే.. ఏడాదికి రూ.74 వేల కోట్లు విలువైన ఇంధనాన్ని ఆదా చేయగలమని విశాల్ కపూర్‌తో పాటు ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



అశోక్ మృతదేహం, (ఇన్‌సెట్) అశోక్(ఫైల్)

పాడేరు: మండలంలోని కొత్త పాడేరు సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ బావిలో గిరిజన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రాథమిక సమాచారం మేరకు వివరాలు. పట్టణానికి చెందిన జి.అశోక్(23) మంగళవారం మరో నలుగురు స్నేహితులతో కలిసి కొత్త పాడేరులోని వ్యవసాయ బావి వద్ద మద్యం సేవించాడు. మద్యం మత్తులో స్నేహితుల మధ్య మాటమాట పెరిగి ఒకరి మొబైల్‌ను బావిలో విసిరేశారు. ఆ మొబైల్‌ను తీసుకునేందుకు మద్యం మత్తులో ఉన్న అశోక్ బావిలో దూకి, ఊపిరాడక మృతి చెంది ఉంటారని స్థానికులు చెప్తున్నారు. ఈ విషయంపై పాడేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. కానీ పూర్తి వివరాలు వెల్లడించలేదు. మృతదేహాన్ని బయటకు తీసి జిల్లా ఆస్పత్రికి తరలించారు. శవపంచనామాలో వైద్యులు ఇచ్చే నివేదిక ఆధారంగా యువకుడి మృతిపై పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

7న నేవీ మారథాన్ సన్నాహక పరుగు

విశాఖ స్పోర్ట్స్: ఆరోగ్య కరమైన జీవనశైలి సందేశాన్నిస్తూ వైజాగ్ నేవీ మారథాన్(వీఎన్ఎం)లో భాగంగా సన్నాహక పరుగు పోటీలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో డిసెంబర్ 15వ తేదీన ఈ పరుగు విశాఖ సాగర తీరంలో జరగనుంది. ఇందులో భాగంగా జూలై 7వ తేదీన సన్నాహక పరుగు నిర్వహించనున్నారు. ఇప్పటికే తొలి అడిషన్ గత నెల 2వ తేదీన నిర్వహించగా దాదాపు 250 మంది పరుగుపెట్టారు. రెండో అడిషన్‌గా జూలై 7వ తేదీన నిర్వహించే ఈ పరుగులో పాల్గొనేందుకు www.vtra.run వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్స్ చేసుకోవాలి. మూడో ట్రయిల్ రన్ ఆగస్టు 4వ తేదీన జరగనుంది.

జూలో మకరంద మొక్కల పెంపకం

ఆరిలోవ (విశాఖ): ఇందిరా గాంధీ జూ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం కొద్ది రోజులుగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మారిసన్ హెర్స్‌ఫీల్డ్ ఉద్యోగులు బుధవారం జూలోని సీతాకోక చిలుకల పార్కులో మకరందం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని జూ క్యూరేటర్(ఎఫ్ఏసీ) జి.మంగమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతాకోక చిలుకలకు ఉపయోగపడే మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. ఈ మొక్కలు సీతకోక చిలుకలకు స్థిరమైన ఆవాసాలుగా నిలుస్తాయన్నారు. జీవవైవిధ్యం, సహజ సౌందర్యంతో కూడిన పర్యావరణాన్ని పెంపొందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో మారిసన్ హెర్స్‌ఫీల్డ్ ఉద్యోగులు, జూ అసిస్టెంట్ క్యూరేటర్ గోపి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు భారతి, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఒకరికి ఏడాది జైలు

విశాఖ లీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ నగరంలోని 7వ స్పెషల్ మెజిస్ట్రేట్ డి.విశ్వనాథం బుధవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 3 నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఫిర్యాదిదారు తరఫు న్యాయవాది కదిరి రాము తెలిపిన వివరాలివీ.. అక్కయ్యపాలేనికి చెందిన ఫిర్యాదిదారు కరుభుక్త పద్మ నుంచి అక్కిరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన నిందితుడు ఆడారి శాంతారాం, అతని భార్య ఆడారి లక్ష్మీకాంతం 2021 ఫిబ్రవరి 14న రూ.12 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ప్రామిసరీ నోటు రాసి ఇచ్చారు. పద్మ ఎన్ని పర్యాయాలు అప్పు తీర్చమని అడిగినా భార్యాభర్తలు స్పందించలేదు. ఎట్టకేలకు ఆడారి శాంతారాం భార్యాభర్తలిద్దరి తరఫున గతేడాది జనవరి 23న రూ.10 లక్షల చెక్కును ఆమెకు ఇచ్చారు. పద్మ ఆ చెక్కును బ్యాంక్ ఖాతాలో జమ చేయగా.. తగినన్ని నిధులు లేని కారణంగా బౌన్స్ అయింది. దీంతో బాధితురాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

ప్రారంభమైన ఐటీఐ కౌన్సెలింగ్

కంచరపాలెం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2023-24 విద్యా సంవత్సరానికి వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి బుధవారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. స్టీల్ ప్లాంట్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ డీఎస్ సునీత, ఉపాధి, శిక్షణ శాఖ ప్రిన్సిపాల్, కన్వీనర్ జె.శ్రీకాంత్ ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్‌లో 1 నుంచి 532 ర్యాంక్ వరకు అభ్యర్థులు పాల్గొనగా.. 230 మంది అభ్యర్థులు ప్రభుత్వ ఐటీఐల్లో అర్హత సాధించారు. రెండవ ర్యాంకర్ దివ్యకు ఎలక్ట్రానిక్ మెకానిక్ ట్రేడ్‌లో అర్హత పత్రాన్ని అధికారులు అందజేశారు. గురువారం 533 నుంచి 1278 ర్యాంక్ వరకు అభ్యర్థులు కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ ధ్రువీకరణపత్రాలతో హాజరు కావాలని కన్వీనర్ శ్రీకాంత్ సూచించారు. కౌన్సెలింగ్‌లో పాల్గొన్న తల్లిదండ్రులు, విద్యార్థులకు మంచినీరు, మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఉమాశంకర్, ఎ.రమణ, పి.వి.బాలాజీ, సిహెచ్ ఈశ్వరరావు, వంటాకుల శ్రీనివాసరావు, ఎ.జయలక్ష్మి ఈ ప్రక్రియను పర్యవేక్షించారు.

కమతాలు, పంటల వారీగా సాగు వివరాల సేకరణ



వ్యవసాయ గణన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉప సంచాలకులు సౌజన్య

- రెండో దశ వ్యవసాయ గణనపై శిక్షణలో అర్థ గణాంక శాఖ డీడీ సౌజన్య

తుమ్మపాల: వ్యవసాయ గణనలో భాగంగా కమతాలు, పంటల వారీగా సాగు వివరాలు నమోదు చేయాలని అర్థ గణాంక శాఖ ఉపసంచాలకులు కె.సౌజన్య సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెండవ దశ వ్యవసాయ గణన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2021-22 సాగు సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకుని వివరాలు నమోదు చేయాలన్నారు. వ్యవసాయ గణనలో మండల స్థాయిలో సహాయ గణాంకాధికారులు, గ్రామ స్థాయిలో గ్రామ రెవెన్యూ అధికారులు ప్రాథమిక కార్యకర్తలుగా, మండల సహాయ గణాంకాధికారులు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారని చెప్పారు. ముందుగా వ్యవసాయ గణన ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధానాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

ముఖ్య ప్రణాళికాధికారి జి.రామారావు మాట్లాడుతూ వ్యవసాయ గణనకు సంబంధించి ఇన్‌పుట్ సర్వేలో రైతుల విద్యార్హతలు, వారు వినియోగించిన పనిముట్లు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, రైతు బీమా, రైతు తీసుకున్న వ్యవసాయ రుణాలు తదితర వివరాలను సేకరించాలన్నారు. ప్రతి మండలంలో ఎంపిక చేసిన గ్రామంలో కచ్చితత్వంతో కూడిన వివరాలను కేంద్ర ప్రభుత్వ మొబైల్ యాప్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. కార్యక్రమంలో గణాంకాధికారి ఎస్.శ్రీరామమూర్తి, ఉప గణాంకాధికారులు, జిల్లాలోని సహాయ గణాంకాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా తిరువీధి ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



ఘాట్‌రోడ్డు మీదుగా సాగుతున్న తిరువీధి ఉత్సవంలో మహిళల కోలాటం

దాబాగార్డెన్స్ (విశాఖ) : ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం తిరువీధి రథయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు విశేష హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు తిరువీధి రథయాత్ర చేపట్టారు. స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన తిరువీధి రథయాత్ర ఘాట్‌రోడ్డు, పూర్ణామార్కెట్, పోలీస్ బ్యారెక్స్, ఆంజనేయస్వామి ఆలయం మీదుగా తిరిగి సత్యనారాయణస్వామి ఆలయం వరకు సాగింది. దారి పొడవునా కోలాటం.. సంకీర్తనలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో బుద్ద నాగజగదీష్ పర్యవేక్షించారు.

నేడు వైదిక సదస్యం..

దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజలు, 9 గంటలకు సుదర్శన హోమం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు వైదిక సదస్యం, మహదాశీర్వచనం (పండిత సత్కారం) చేపట్టనున్నారు.

సుందరంగా పిల్లల పార్కు

అధికారులకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం



పిల్లల పార్కు మ్యాప్ పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

ఆరిలోవ (విశాఖ): ముడసర్లోవ వద్ద నిర్మిస్తున్న పిల్లల పార్కును సుందరంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ముడసర్లోవ వద్ద నిర్మాణంలో ఉన్న పిల్లల పార్కు, ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక నిర్మాణంలో ఉన్న జీవీఎంసీ నర్సరీని అధికారులతో కలసి బుధవారం ఆయన సందర్శించారు. చిల్డ్రన్ పార్కులో వాకింగ్ ట్రాక్ నిర్మాణం, పార్కులో ఎక్కడ ఏఏ పనులు చేపడుతున్నారు? మరుగుదొడ్లు ఎక్కడ నిర్మిస్తున్నారు? పిల్లలు ఆట పరికరాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారు? ఎలాంటి ఆట పరికరాలు అందుబాటులోకి తీసుకొస్తున్నారు? తదితర విషయాలను జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ శ్యాంసన్ రాజును అడిగి తెలుసుకున్నారు. పిల్లలు ఆటలు ఆడుకోవడానికి అనుకూలంగా ఉండే విధంగా ఈ పార్కును తీర్చిదిద్దాలని ఆదేశించారు. అనంతరం ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక కొత్తగా నిర్మిస్తున్న జీవీఎంసీ నర్సరీని సందర్శించారు. నర్సరీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జోన్-2 జోనల్ కమిషనర్ శైలజ వల్లి, కార్యనిర్వాహక ఇంజినీర్ శాంతిరాజు, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిశోర్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ వంశీ, సహాయక ఇంజినీర్ శ్రీధర్ పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 21 శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. హెటిరో ల్యాబ్స్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, గ్లాడియేటర్ సెక్యూరిటీ సర్వీసెస్, జాబ్ డీలర్స్, హ్యూమన్ పవర్ సర్వీసెస్, ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 461 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. రిసెప్షనిస్ట్, అకౌంటెంట్ ట్యాలీ, హౌస్ కీపింగ్, ట్రైనీ కెమిస్ట్, జూనియర్ కెమిస్ట్ ఆపరేటర్ ట్రైనీ, టెక్నీషియన్లు, ట్రైనీ, హెల్పర్స్, సర్వీస్ ట్రైనీ, మెకానిక్ హెల్పర్లు, సెక్యూరిటీ గార్డ్స్, గ్రాఫిక్ డిజైనర్స్ తదితర ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన వారు అర్హులు. 18-35 ఏళ్ల వయసున్న పురుష, మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావచ్చు. ఆయా ఉద్యోగాలను బట్టి నెలకు రూ.12 వేల నుంచి రూ.28 వేల వరకు జీతం ఉంటుందని.. ఆరోజు 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని సుబ్బిరెడ్డి తెలిపారు.

నేడు, రేపు బీసీ గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష



జిల్లా కన్వీనర్ వెంకటరెడ్డి

నర్సీపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6,7,8,9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 20, 21 తేదీల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్, నర్సీపట్నం గురుకులం ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి తెలిపారు. 20న 6,8 తరగతుల విద్యార్థులకు, 21న 7,9 తరగతుల విద్యార్థులకు విశాఖలోని సింహాచలం గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు. మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో హాల్‌టిక్కెట్లు డౌన్లోడ్ చేసుకుని, పరీక్షకు హాజరు కావాలని ఆయన సూచించారు.

30 నుంచి రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా దివ్యాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి

మహారాణిపేట: విశాఖ వేదికగా పోలీస్ బ్యారెక్స్ మైదానంలో ఈ నెల 30వ తేదీ నుంచి 5వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ పారా అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జిల్లా దివ్యాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న దివ్యాంగ క్రీడాకారులు 7013569514, 9390131777కు సంప్రదించి.. పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ కో-ఆర్డినేటర్ వై.శ్రీనివాస్ గౌడ్ సూచించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి, బి.గణేశ్, ఎం.నరసింహ రాజు, హుస్సేన్, రమేష్ బాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

టేకు ప్లాంటేషన్ పనుల పరిశీలన



ప్లాంటేషన్ పనులను పరిశీలిస్తున్న ట్రైనీ డీఎఫ్‌వో అబ్దుల్ రాఫ్

గొలుగొండ: మండలంలోని నిమ్మగెడ్డ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న టేకు ప్లాంటేషన్ పనులను నర్సీపట్నం ట్రైనీ డీఎఫ్‌వో అబ్దుల్ రాఫ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నూతనంగా టేకు ప్లాంటేషన్ ఏర్పాటు చేయడం వల్ల అటవీశాఖకు ఆదాయం లభిస్తుందని తెలిపారు. అటవీశాఖ భూములున్న ప్రాంతాల్లో టేకు ప్లాంటేషన్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణదేవిపేట రేంజర్ వెంకట రమణ, గొలుగొండ సెక్షన్ అధికారి లక్ష్మణ్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

- రెండు వారాల్లో ఇది మూడోసారి

ఆరిలోవ: సముద్రంలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతిని ఆరిలోవ పోలీసులు రక్షించారు. తెన్నేటిపార్కు వద్ద జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివీ.. అనకాపల్లికి చెందిన ఓ మూగ యువతి, నగరానికి చెందిన మూగ యువకుడు వాల్తేరులోని చెవిటి, మూగు స్కూల్‌లో చదువుకున్నారు. ఆ సమయంలోనే వారిద్దరూ ప్రేమించుకున్నారు. ప్రస్తుతం ఆ యువతి అనకాపల్లిలో ఉంది. కొద్దిరోజుల కిందట విశాఖ వచ్చి ఆ యువకుడిని కలిసింది. ఏమైందో గానీ బుధవారం సాయంత్రం తెన్నేటి పార్కు వద్ద సముద్రంలో దిగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన సందర్శకులు కేకలు వేశారు. అక్కడకు సమీపంలోని జోడుగుళ్లపాలెం అవుట్ పోస్ట్ పోలీసులు వెంటనే స్పందించి యువతిని రక్షించి స్టేషన్‌కు తరలించారు. అనకాపల్లిలో ఉన్న ఆమె తల్లిదండ్రులను రప్పించి అప్పగించారు. యువకుడిని ప్రేమించిన వ్యవహారంలో ఎంత చెప్పినా తమ మాట వినడం లేదని తల్లిదండ్రులు పోలీసులకు చెప్పి.. ఆ యువతిని తీసుకెళ్లారు. కాగా.. రెండు వారాల్లో ఆ యువతి మూడుసార్లు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.